# సాక్షి
## వైఎస్‌ఆర్ జిల్లా

గురువారం । 23 । జనవరి । 2025






### కుక్కల దాడిలో 25 గొర్రెలు మృతి
మండల కేంద్రమైన చాపాడులోని కాకతీయ కాలనీలో గొర్రెల మందపై కుక్కలు దాడి చేయగా 25 గొర్రెలు మృతి చెందాయి.
-8లో



### మట్టి టిప్పర్లతో పంటలకు నష్టం
ఆరుగాలం కష్టపడి సాగు చేసిన రైతుల పంట పొలాలు మట్టిని తరలిస్తున్న టిప్పర్ల కారణంగా తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది.
-8లో

### వాతావరణం
గరిష్టం/కనిష్టం
29.4 /14.6

జిల్లాలో బుధవారం 14.6 - 29.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

## న్యూస్‌రీల్

### 7న జెడ్పీ సర్వసభ్య సమావేశం
కడప సెవెన్‌రోడ్స్: జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఫిబ్రవరి 7వ తేది ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ ఓబులమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన జెడ్పీ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, జిల్లా అధికారులు ఆరోజు ఉదయం 10 గంటలకు కడపలోని జెడ్పీసమావేశ మందిరంలో జరిగే సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలని కోరారు.

### నేడు జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ ఎంపికలు
కడప ఎడ్యుకేషన్: జిల్లా మహిళ, పురుషుల అండర్ 23 ఇంటర్ డిస్ట్రిక్ జిల్లాస్థాయి బాస్కెట్ బాల్ ఎంపికలను 23వ తేదీ గురువారం కడపలోని జయనగర్‌కాలనీ జిల్లా పరిషత్తు బాలికల హైస్కూల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సదశివారెడ్డి తెలిపారు. ఈ పోటీలలో ప్రతిభ చాటిన వారు ఈ నెల 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు విజయవాడలోని మేరిస్ స్టెల్లా కాలేజీలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని వివరించారు. ఈ పోటీలలో పాల్గొనే క్రీడాకారులు 2002 జనవరి 1వ తేదీకి ముందు పుట్టినవారై ఉండాలని తెలిపారు. క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్‌కార్డుతో హాజరుకావాలని సూచించారు.

### ఆర్టీసీ సంక్రాంతి ఆదాయం అదుర్స్

కడప కోటిరెడ్డిసర్కిల్: సంక్రాంతి పండక్కు కడప జోన్ నుంచి ప్రత్యేక సర్వీసులు నడపడం ద్వారా ఆర్టీసీకి భారీ ఆదాయం వచ్చింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాలతోపాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల రాజధానులైన హైదరాబాదు, చెన్నై, బెంగుళూరు నగరాలకు ఈ ప్రత్యేక బస్సులు నడిచారు. వైఎస్సార్ జిల్లాలోని వివిధ డిపోల నంచి 412 బస్సులు నడపడం ద్వారా రూ. 1,16,63,369 ఆదాయం వచ్చింది. అలాగే అన్నమయ్య జిల్లాకు సంబంధించి 167 బస్సులు తిప్పడం ద్వారా రూ. 37,06,184 రాబడి వచ్చింది. ఈ సందర్భంగా ఆర్టీసీ కడప జోన్ ఈడీ పైడి చంద్రశేఖర్ మాట్లాడుతూ పండుగ సందర్భంగా విస్తృత సేవలు అందించిన సంస్థలోని ఉద్యోగులను అభినందించడంతో పాటు ఆర్టీసీ బస్సులను ఆదరించిన ప్రయాణికులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

### సెమిస్టర్ ఫలితాల విడుదల

సిబ్బందితో కలిసి సెమిస్టర్ ఫరీక్షల ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ తదితరులు

కడప ఎడ్యుకేషన్: వై.ఎస్.ఆర్ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలోని 7,5,3 సెమిస్టర్ పరీక్షల ఫలితాలను వీసీ ఆచార్య జి. విశ్వనాథకుమార్ బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా తక్కువ సమయంలో ఫలితాల విడుదలకు కృషి చేసిన సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ అదనపు పరీక్షల నియంత్రణాధికారి జి.ఫణీంద్ర రెడ్డి, సహాయ పరీక్షల నియంత్రణాధికారి ఉదయప్రకాష్‌రెడ్డి, నారపరెడ్డి, పీఆర్‌ఓ వి. శివకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

### జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బాలురు

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని శివ శివాని స్కూల్‌లో బుధవారం 71వ కడప జిల్లా కబడ్డీ సీనియర్ ఎంపికలను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కడప జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ గోవర్ధన్ రెడ్డి, సెక్రటరీ జనార్ధన్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ జనవరి 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే 71వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో ఈ క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ సుకుమార్, జాయింట్ సెక్రెటరీ ప్రసాద్, రవిశంకర్, ట్రెజరర్ జయచంద్ర, బెనర్జీ, సురేంద్ర, రాకేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

**బాలుర జట్టు ..**
కబడ్డీ సీనియర్ విభాగంలో దినేష్ చౌదరి, శివాజీ, వంశీధర్ రెడ్డి, అరవింద్, సుదర్శన్, రెడ్డయ్య, మహేశ్వర్ రెడ్డి, బాలసుబ్రహ్మణ్య సాయి, శ్రీధర్‌రెడ్డి, విష్ణు, సూరి ఎంపికయ్యారు. స్టాండ్ బై కింద సిద్ధిక్, ప్రవీణ్ కుమార్, అశోక్, వర్ధన్‌లను ఎంపిక చేశారు.

**బాలికల జట్టు ..**
బాలికల విభాగంలో షాహినా, నాగశృతి, చైతన్య, మానస, పద్మశ్రీ, గౌరీ, నాగవేణి, శివకవిత, శ్రావణి, మల్లేశ్వరి, పల్లవి, చెన్నమ్మలను ఎంపిక చేశారు. అలాగే స్టాండ్ బై కింద మేఘన, వైష్ణవి ఎంపికయ్యారు.

# ప్రతిధ్వనించిన రామనామం

- నగరం రోడ్లు కాషాయమయం
- అడుగడుగునా భక్తుల నీరాజనం
- 12 గంటలకు పైగా సాగిన శోభా యాత్ర
- పాల్గొన్న ఎంపీ, మేయర్


రాయలవారి సాక్షిగా... రామయ్య యాత్ర: కృష్ణా సర్కిల్ వద్ద భక్తజనసందోహం


శోభాయాత్రలో ప్రత్యేక ఆకర్షణగా రామయ్య విగ్రహం

కడప కల్చరల్: కడప నగరంలో హిందువుల ఆధ్యాత్మిక మహా శోభాయాత్ర వైభవంగా సాగింది. అయోధ్యలో బాల శ్రీరాముడి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఏడాది గడిచిన సందర్భంగా తొలి వార్షికోత్సవాన్ని ఈ యాత్ర నిర్వహణ ద్వారా నిర్వహించుకున్నారు. అయోధ్య ఐక్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయం కేంద్రంగా దీని పూర్వాంగ కార్యక్రమాలు సాగాయి. ఉదయం 10 గంటలకు శోభాయాత్ర ప్రారంభమైంది. శ్రీరామునిపై భక్తి గీతాలను వినిపిస్తుండగా మంగళ వాయిద్యాల నిపుణులు కమ్మని సుస్వరాలు ఆలపిస్తుండగా కళాకారుల విన్యాసాల నడుమ యాత్ర సాగింది. ఈ సందర్భంగా ప్రత్యేకంగా పూలతో అలంకరించిన రథంపై శ్రీరాముని భారీ విగ్రహాన్ని కొలువుదీర్చారు. వేద పండితులు నిరంతరాయంగా మంత్రోచ్ఛాటనలు చేస్తూ ప్రజలకు అడుగడుగునా కల్యాణ హారతులు ఇస్తుండగా, భక్తులు తన్మయత్వంతో కార్యక్రమాలను తిలకించారు.

- ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ తదితర ధార్మిక సంఘాలతో పాటు పలు దేవాలయాల నిర్వాహక కమిటీ సభ్యులు, భక్తులు, భజన బృందాలు, అర్చక సంస్థలు, హిందూ సంఘాల ప్రతినిధులు భారీ సంఖ్యలో యాత్రలో పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి ప్రత్యేక వాహనాల్లో భక్తులు ఈ యాత్ర కోసం ప్రత్యేకంగా విచ్చేశారు. యాత్రలో దాదాపు ప్రతి ప్రధాన కూడలిలోనూ అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన సౌకర్యం మంచినీరు అందుబాటులో ఉంచారు. అయోధ్య ఐక్యవేదిక స్థానిక ప్రతినిధి వెంకటరెడ్డి ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. పోలీసులు, నగర పాలక సంస్థ అధికారుల సహకారంతో యాత్ర సజావుగా కొనసాగింది.

**భక్తజన ప్రవాహం:** మున్సిపల్ మైదానం నుంచి ప్రారంభమైన యాత్ర 25 కూడళ్ల మీదుగా సాగింది. ప్రధాన కూడళ్లతోపాటు రోడ్లకు ఇరువైపుల భక్తులు కార్యక్రమాన్ని తిలకించేందుకు చేరుకున్నారు. తమవంతుగా భక్తిని చాటుకుంటూ యాత్రలో పాల్గొనే వారికి పండ్లు, ఫలహారాలు అందించారు.

**నేడు శ్రీరామ విజయజ్యోతి ప్రజ్వలన**
శోభాయాత్ర విజయవంతమైందన్న సంతోషంతో దానికి కొనసాగింపుగా గురువారం సాయంత్రం పాలకొండల్లో విజయజ్యోతి వెలిగించనున్నారు. 250 మీటర్ల సైన్ వస్త్రంతో తయారు చేసిన ఒత్తిని 50 లీటర్ల నేతితో వెలిగించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

## వైభవం...శ్రీ సీతారాముల కల్యాణం


కల్యాణ రాగాలు వినిపిస్తున్న కళాకారిణి

కడప కల్చరల్: కడప నగరంలోని మున్సిపల్ మైదానంలో శ్రీ సీతారాముల కల్యాణోత్సవ అయోధ్య ఐక్య వేదిక ప్రతినిధి దేసు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. టీటీడీ వేదిక్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజేష్ భట్టర్ ఆధ్వర్యంలో విజయ్‌భట్టర్ బృందం కల్యాణ క్రతువును భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేదికపై శ్రీ సీతారామ లక్ష్మణుల ఉత్సవర్లను కల్యాణ మూర్తులుగా అలంకరించి పెళ్లి పీటలపై కొలువుదీర్చారు. మంగళ వాయిద్యాలు మధురంగా వినిపిస్తుండగా వేద పండితుల మంత్రోచ్చాటనలు ప్రతిధ్వనిస్తుండగా కల్యాణ క్రతువు కమనీయంగా సాగింది. అతిథులుగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, నగర మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్యే మాధవీరెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, పలువురు హాజరై కల్యాణాన్ని వీక్షించారు. అనంతరం అక్షతారోపణ, పూల మాలల మార్పిడి నిర్వహించారు.


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు


స్వామి, అమ్మవారికి హారతులు

**నయనానందకరం...**
కల్యాణం ఆద్యంతం నయనానందకరంగా సాగింది. మహిళలు కోలాటాలు చేశారు. స్థానిక గాయక బృందం సీతారాములపై గీతాలాపనలు చేశారు. అనంతరం ప్రత్యేకమైన కౌంటర్ల ద్వారా భక్తులకు కల్యాణ తలంబ్రాలను అందజేశారు. ఆ పక్కనే అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు.


కల్యాణోత్సవంలో పాల్గొన్న కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, నగర మేయర్ సురేష్‌బాబు తదితరులు

## కార్మికులకు నగదు బహుమతులు ప్రదానం
కడప సెవెన్‌రోడ్స్: పారిశుద్ధ్యకార్మికులు ఒక్కొక్కరికీ లక్ష రూపాయల నగదు బహుమతిని బుధవారం కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తన చాంబర్‌లో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైదుకూరు మున్సిపాలిటికి చెందిన పారిశుద్ధ్య కార్మికులు పి.అమ్ములమ్మ, జి. చెన్నమ్మ, యం.గంగాధర్ అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ సమాజ శ్రేయస్సుకు ఎంతో విలువైన సేవలందిస్తున్నారన్నారు. ప్రతి రోజు ఉదయం 5.30 గంటలకే విధులకు హాజరై మైదుకూరు రోడ్లు, టౌన్, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంలో వీరి కృషి అభినందనీయమన్నారు. వీరి కృషి, పట్టుదలను గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 18న మైదుకూరు సభలో ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున ముగ్గురు మూడు లక్షల నగదు బహుమతిని ప్రకటించారన్నారు. తమ సేవలను గుర్తించినందుకు పారిశుద్ధ్య కార్మికులు ముఖ్యమంత్రికి, కలెక్టరుకు కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్‌తోపాటు జేసీ అదితి సింగ్, మైదుకూరు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

### వంట గదుల పరిశీలన

దేవగుడి పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

జమ్మలమడుగు: మండల పరిధిలోని మూడు పాఠశాలల్లో వంట గదులను కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ పరిశీలించారు. బుధవారం సాయంత్రం మండల పరిధిలోని దేవగుడి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, మోరగుడి, బాలుర ఉన్నత పాఠశాలల్లో వంట గదులను పరిశీలించారు. మండలంలోని పాఠశాలలకు వంటలు తరలించేందుకు సెంట్రల్ వంట గదులను ఏర్పాటు చేయబోతున్నామని అందుకోసం పరిశీలన చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ మీనాక్షి, ఆర్డీఓ సాయిశ్రీ, ఎంఈఓ వెంకటరమణరెడ్డి చంద్రశేఖర్‌రావు తహసీల్దార్ శ్రీనివాసుల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీమకు ద్రోహం చేస్తున్నారు
**రాయలసీమ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు**


ప్రత్యేక రాయలసీమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్న నాయకులు

జమ్మలమడుగు: తరతరాలుగా రాయలసీమకు అన్యాయమే జరుగుతోందని.. ప్రస్తుత కూటమి చర్యలు కూడా అలాగే ఉన్నాయని రాయలసీమ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు ప్రతాపరెడ్డి మండిపడ్డారు. కడపలో స్టీల్‌ప్లాంట్‌ను నిర్మిస్తామని చెప్పి ప్రస్తుతం అనకాపల్లిలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేస్తామని చెప్పడం రాయలసీమకు తీవ్రమైన అన్యాయం చేయడమే ధ్వజమెత్తారు. బుధవారం స్థానిక ఐటీఐ ఆవరణలో విద్యార్థులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో స్టీల్ ప్లాంట్ నిర్మాణం చేసి.. ఈ ప్రాంత వాసులకు ఉపాధి కల్పించాలన్న ఆలోచన, చిత్తశుద్ధి పాలకులకు కనిపించడం లేదని విమర్శించారు. రాయలసీమ ప్రాంత వాసులకు ప్రత్యేక రాష్ట్రం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## విద్యాశాఖను అభివృద్ధి పథంలో నడిపిస్తాం
**నూతన డీఈఓ షేక్ షంషుద్దీన్**


డీఈఓగా బాధ్యతలు చేపట్టిన షంషుద్దీన్‌కు అభినందనలు తెలుపుతున్న డీఈఓ కార్యాలయ సిబ్బంది

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో అందరి సహకారంతో విద్యాశాఖను అభివృద్ధి పథకంలో నడిపిస్తామని జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ షేక్ షంషుద్దీన్ పేర్కొన్నారు.

జిల్లా విద్యాశాఖ అధికారిగా నియమితులైన షంషుద్దీన్ బుధవారం రాత్రి కలెక్టర్ శ్రీధర్‌ను తమ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం డీఈఓ కార్యాలయానికి చేరుకుని జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలను చేపట్టారు. డీఈఓకు ఏడీ మునీర్‌ఖాన్, సూపరింటెండెంట్లు బాదుల్లా, రఫీక్, మాజీ సైన్సు అధికారి రెహమాన్ తదితరులు అభినందించారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

ఆర్‌జేడీగా బాధ్యతలు చేపట్టిన శ్యాముల్‌ను అభినందిస్తున్న ఆపస్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, పరిరక్షణకు కృషి చేయాలని పాఠశాల విద్య ఆర్జేడి శామ్యూల్‌కు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) కడప జిల్లా శాఖ విజ్ఞప్తి చేసింది. పాఠశాల విద్య కడప ఆర్జేడీగా పదోన్నతి పొంది బాధ్యతలు చేపట్టిన శామ్యూల్‌ను బుధవారం కడపలోని ఆర్జేడి కార్యాలయంలో ఆపస్ నాయకులు కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. వెంకట్రామిరెడ్డి, కడప జిల్లా ప్రధాన కార్యదర్శి డి. కొండారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొనే నిర్ణయాలపై ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధుల, ఉపాధ్యాయుల అభిప్రాయాలు తీసుకోవాలని కోరారు. నాగరాజు, నారాయణరెడ్డి,శ్రీనివాసులు,రెడ్డయ్య పాల్గొన్నారు.

# ఆగిన పనులు.. సాగేనా!

- 2020-21లో వేంపల్లెలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు
- అర్ధాంతరంగా నిలిచిపోయిన తరగతి భవనాలు
- అరకొరగా ల్యాబ్ సౌకర్యం
- రెగ్యులర్ అధ్యాపకుల్లేక విద్యార్థుల అవస్థలు


వేంపల్లెలో అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాలు


పాత జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు

వేంపల్లె: విద్యారంగంలోని సమస్యలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఇప్పటికే నాడు-నేడు పనులను పక్కనబెట్టగా.. తల్లికి వందనం ఎప్పుడు అమలు చేస్తారో తెలియని పరిస్థితి. తాజాగా పలుచోట్ల నిర్మాణంలో ఉన్న కళాశాల భవనాలను పూర్తి చేయాలన్న చిత్తశుద్ధే కూటమి నేతలకు లేకుండా పోయింది. మండల కేంద్రమైన వేంపల్లెలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలే ఇందుకు నిదర్శనం. 2020-21లో ఇక్కడ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేశారు. బీఎస్సీ, బీఏ, బీకాం గ్రూపులను ఏర్పాటు చేసి ఇంగ్లీష్ మీడియంలో బోధిస్తున్నారు.

పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత విద్య దూరం కాకూడదనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, వేంపల్లె జెడ్పీటీసీ ఎం.రవికుమార్ రెడ్డి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వెంటనే కళాశాల మంజూరు చేసి నిధులు కేటాయించారు. గండి రోడ్డులోని వైఎస్ రాజారెడ్డి నగర్ గుట్టపైన 15ఎకరాల సువిశాలమైన ప్రదేశం, ప్రశాంత వాతావరణంలో రూ.20కోట్లతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన తరగతి భవనాలు, ల్యాబ్‌లు, ప్రహరీ గోడలు, రూ 10.కోట్లతో ఇంటర్నల్ రోడ్లు, ఆడిటోరియంలు అత్యాధునిక డిజైన్లతో నూతనంగా నిర్మించేలా నిధులు మంజూరు చేశారు. 55శాతం నిర్మాణ పనులు పూర్తి చేశారు.

- ఆ తర్వాత ఎన్నికలు రావడం.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు అటకెక్కాయి. సదరు కాంట్రాక్టర్‌కు రూ.2.40కోట్లు బిల్లులు బకాయిలు పెండింగ్ ఉన్నాయి. దీంతో తరగతి భవన నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ప్రస్తుతం వేంపల్లెలోని పాత జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల భవనాలలో నిర్వహిస్తున్నారు. అరకొర ల్యాబ్ సౌకర్యాలు, మౌలిక వసతులు సరిగా లేక ఇబ్బందుల నడుమ విద్యాభ్యాసం సాగుతోంది. ఇక్కడ శాశ్వత ప్రాతిపదికన సిబ్బంది నియామకాలు కూడా జరగలేదు.

**పీఎం-యుఎస్‌హెచ్‌ఏ స్కీం కింద ఎంపిక:**
ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 80 శాతం విద్యార్థినులు ఉండటంతో ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్ కింద కళాశాల ఎంపికైంది. అందుకు డీపీఆర్ పంపాలని కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు సైతం వచ్చాయి. పైగా వేంపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల కార్పొరేట్ కళాశాలలో దీటుగా పోటీ పడుతోంది. 2020-21 విద్యా సంవత్సరంలో 75 శాతం, 2021-22లో 80 శాతం, 2022-23లో 82 శాతం, 2023-24లో 83 శాతం ఫలితాలు వచ్చాయి. ఇంకా మెరుగైన వసతులు, శాశ్వత ప్రాతిపదికన అధ్యాపకులను నియమిస్తే వంద శాతం ఫలితాలను సాధించేందుకు అవకాశం ఉంది. ఈ దిశగా జిల్లా ఉన్నతాధికారులు, కూటమి నేతలు స్పందించి సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

### నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పనే లక్ష్యంగా..
రెండేళ్లుగా నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పనే లక్ష్యంగా డిగ్రీ కళాశాల దినదినాభివృద్ధి చెందుతోంది. 2021లో 13 మంది విద్యార్థులు, 2022లో 69 మంది విద్యార్థులు తమ నైపుణ్యతను సాధించి పెద్ద, పెద్ద కంపెనీలలో ఉద్యోగాలు సాధించారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ టీ.వీ.అరవింద్ ఆధ్వర్యంలో దాదాపు 300 మంది విద్యార్థులకుపైగా ఉద్యోగాలతోపాటు ఉన్నత చదువులు అభ్యసిస్తున్నారు.

### అరకొరగా ల్యాబ్ సౌకర్యం

ఇక్కడ అరకొరగా ల్యాబ్ సౌకర్యాలు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న అధ్యాపకులు నాణ్యమైన బోధన అందిస్తున్నారు. దీంతో మంచి ఫలితాలను సాధిస్తున్నాం. సరైన మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నాం. - జి.చందన (బీఎస్సీ హానర్స్ బాటనీ విద్యార్థిని), వేంపల్లె

### బాలికలకు హాస్టల్ వసతి కల్పించాలి

డిగ్రీ కళాశాలలో 80 శాతం మహిళలు ఉన్నందున హాస్టల్ వసతిని ఏర్పాటు చేస్తే బాగుంటుంది. కొత్తగా నిర్మిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవనాలలో హాస్టల్‌ను ఏర్పాటు చేయాలి. అలాగే ఆటస్థలం, జిమ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి. - నవనీత(బీఎస్సీ విద్యార్థిని), వేంపల్లె

### త్వరగా నిర్మాణాలు పూర్తి చేయాలి

అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరగతి భవనాలు త్వరగా పూర్తి చేయాలి. అరకొరగా ల్యాబ్ సౌకర్యం ఉన్నందున విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న అధ్యాపకులతో ఉత్తమ బోధన అందిస్తున్నాం. త్వరలోనే సమస్యలు పరిష్కారమవుతాయని ఆశిస్తున్నాం. -సి.యోగాంజనేయులు, (కళాశాల ప్రిన్సిపాల్), వేంపల్లె

## క్లుప్తంగా

### అట్టపెట్టెలతో అయోధ్య రామ మందిరం



పుల్లంపేట : దళవాయిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రమణ అట్టపెట్టెలతో అయోధ్య రామ మందిరం నమూనా తయారు చేశారు. అయోధ్య రామ మందిరంలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ జరిగి ఏడాది పూర్తయిన సందర్భంగా దీన్ని తయారు చేసినట్లు తెలిపారు.

### అదనపు కట్నం కోసం వేధింపులు

చాపాడు : మండల పరిధిలోని పల్లవోలుకు చెందిన చెట్టూరి అఖిల(23) అనే వివాహితను ఆమె భర్త సుధీర్‌కుమార్, అత్త జయమ్మ గత కొంత కాలంగా అదనపు కట్నం కోసం వేధిస్తున్న ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. 2022లో పల్లవోలుకు చెందిన అఖిలకు ప్రొద్దుటూరు మండలం ఉప్పరపల్లెకు చెందిన సుధీర్‌కుమార్‌తో వివాహమైంది. ఈ క్రమంలో గత కొన్ని రోజులుగా పుట్టింటి నుంచి అదనపు కట్నం తీసుకురావాలని ఆమె భర్త, అత్త వేధిస్తుండటంతో అఖిల పల్లవోలులో తన అమ్మగారి ఇంట్లో ఉంటోంది. తనకు న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేయగా సుధీర్‌కుమార్, జయమ్మలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### రైలు కింద పడి బేల్దారి ఆత్మహత్య



ఆంజనేయులు(ఫైల్)

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల రైల్వే స్టేషన్ పరిధిలో కడప వైపు వెళ్లే రైల్వే లైన్ వద్ద దేరంగుల ఆంజనేయులు (36) బుధవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలకు అనంతపురం జిల్లా యాడికి మండలానికి చెందిన ఆంజనేయులు బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఇతనికి భార్య, నలుగురు సంతానం ఉన్నారు. ఐదు నెలల క్రితం ఎర్రగుంట్లకు వచ్చి బేల్దారి పనులు చేసునేవాడు. ఆర్థిక సమస్యల కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# మట్టి టిప్పర్లతో పంటలకు తీరని నష్టం

- టిప్పర్లను అడ్డుకుని రైతుల నిరసన
- పరిహారం చెల్లిస్తామని కాంట్రాక్టర్ల హామీ
- ఆందోళన విరమించిన రైతులు



చెరువు నుంచి మట్టిని తరలిస్తున్న టిప్పర్లను నిలిపేసిన రైతులు



దుమ్ము కారణంగా దెబ్బతిన్న పంటను చూపుతున్న రైతు

ఖాజీపేట : ఆరుగాలం కష్టపడి సాగు చేసిన రైతుల పంట పొలాలు మట్టిని తరలిస్తున్న టిప్పర్ల కారణంగా తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. పంట చేతికి వచ్చే సమయంలో పంట మొత్తం దుమ్ముతో నిండిపోవడంతో పంట దిగుబడి రాక రైతులు నష్టపోతున్నారు. కడుపు మండిన రైతులు ఆందోళనకు దిగారు. దిగివచ్చిన రోడ్డు నిర్మాణ కంపెనీ వారు పరిహారం చెల్లిస్తామని హామీ వచ్చి అక్కడి నుంచి టిప్పర్లను తరలించుకు పోయారు. ఈ సంఘటన ఖాజీపేట మండలం నాగసానిపల్లెలో జరిగింది. వివరాలిలా..

ఖాజీపేట మండలం నాగసానిపల్లె గ్రామంలో చెరువు ఉంది. ఆ చెరువు నుంచి మట్టిని జాతీయ రహదారి నిర్మాణం కోసం తీసుకు పోతున్నారు. ప్రతి రోజు చెరువు నుంచి 15 పెద్ద టిప్పర్ల సాయంతో చెరువులోని మట్టిని తరలిస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా చెరువు నుంచి మట్టిని తీసుకెళుతున్నారు. దీంతో నిత్యం టిప్పర్లు రాక పోకలు చేస్తుండటంతో దుమ్ము అధికంగా వస్తోందని రైతులు వాపోతున్నారు.

**పంటలకు అపార నష్టం..**

చెరువు నుంచి నాగసానిపల్లె ప్రధాన రహదారి పైకి వెళ్లేందుకు సుమారు 3 కిలోమీటర్ల దూరం ఉంది. దారి పొడవునా రైతులు ఎక్కువగా ఆరుతడి పంటలు సాగు చేస్తున్నారు. బొప్పాయి, శనగ, మినుము, వరి, అరటి పంటలు సాగు చేస్తున్నారు. సాగులో ఉన్న పంటల మధ్య నుంచి టిప్పర్లు వెళ్లడంతో దుమ్ము అధికంగా వస్తోంది. అలా వచ్చిన దుమ్ము పంటపై పడుతోంది. పంట దిగుబడి వచ్చే సమయంలో ఇలా దుమ్ము కారణంగా దిగుబడి గణనీయంగా తగ్గడమే కాకుండా పంట పొలాలు పూర్తిగా దుమ్ముమయంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతికందే పంట ఇలా కాంట్రాక్టర్ల నిర్వాకం వల్ల నష్టపోవాల్సి వస్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

**వాహనాలు నిలిపేసి నిరసన..**

చెరువు నుంచి మట్టిని తీసుకు పోతున్న దదాపు 10 టిప్పర్లను రైతులు నిలిపివేశారు. కాంట్రాక్టర్ల స్వార్థం కోసం మట్టిని తరలిస్తే తాము సాగు చేసిన పంట పరిస్థితి ఏమిటని నిలదీశారు.

**పంట నష్ట పరిహారం చెల్లిస్తాం..**

రైతులు నిరసనకు దిగడంతో దిగి వచ్చిన జాతీయ రహదారి నిర్మాణ సంస్థ అధికారులు రైతులతో చర్చించారు. పంట నష్టపరిహారం చెల్లిస్తామని రైతులకు హామీ ఇచ్చి అక్కడి నుంచి టిప్పర్లను తీసుకెళ్లారు. పరిహారం హామీతో రైతులు ఆందోళన విరమించారు.

## రామసుబ్బన్న విద్య, సామాజిక సేవ ఎనలేనిది



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న యోగివేమన యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య కృష్ణారెడ్డి

వీరపునాయునిపల్లె : వీరపునాయునిపల్లెలో కేజీ నుంచి పీజీ వరకు విద్యా సంస్థలు ఏర్పాటు చేసిన విద్యా ప్రదాత ఒంటిగారి రామసుబ్బన్న 25వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన యోగివేమన యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యారంగంతో పాటు సామాజిక సేవలో ఆయన కృషి ఎనలేనిదన్నారు. వీరపునాయునిపల్లె మండల ప్రజల హృదయాల్లోనే కాకుండా చుట్టు పక్కల మండలాల్లో కూడా చెరగని ముద్ర వేసుకున్న వ్యక్తి అని కొనియాడారు. తండ్రి అడుగు అడుగుజాడల్లో నడుస్తూ విద్యా సంస్థలను కొనసాగిస్తున్న వెంకటసుబ్బానాయుడును ఆయన అభినందించారు. అనంతరం రామసుబ్బన్న వర్ధంతి సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 107 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో యోగివేమన విశ్వవిద్యాలయం సీడీసీ డీన్ రఘుబాబు, పరీక్షల నియంత్రణాధికారి కేఎస్వీ కృష్ణ, ప్రొఫెసర్ శ్రీనివాసులు, పులివెందుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు, స్థానిక బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ రాజేష్ నాయుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు నరసింహారెడ్డి, ప్రవంతి, సంగమేశ్వర విద్యా సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

## మోటార్ సైకిల్‌ను ఢీకొన్న ట్యాంకర్

ఇద్దరు యువకుల దుర్మరణం





ప్రవీణ్, సుభాష్ మృతదేహాలు

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని కేంద్ర కారాగారం సమీపంలో బుధవారం రాత్రి మోటార్ సైకిల్‌ను ట్యాంకర్ ఢీకొనడంతో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. ఈ ప్రమాదం గురించి తెలుసుకున్న రిమ్స్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రాణాలతో ఉన్నారేమో అనే ఆశతో పోలీసులు వెంటనే వారిని రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో వైద్యులు పరీక్షించి ఇద్దరు యువకులు మృతి చెందారని నిర్ధారించారు. రిమ్స్ పోలీసుల కథనం మేరకు కడప నగరం రామాంజనేయపురం పరిధిలోని శ్రీరామ్‌నగర్‌కు చెందిన పడిగ ప్రవీణ్ (29), అతని సమీప బంధువు వి. సుభాష్ (23)లు మోటార్ సైకిల్‌పై కడప నగరంలోకి వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా తిరుపతి వైపు నుంచి కర్నూలుకు వెళుతున్న ట్యాంకర్ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. క్యాజువాలిటీ నుంచి మృతదేహాలను మార్చురీకి తరలించారు. ఈ సంఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతుల కుటుంబీకుల ఫిర్యాదు మేరకు రిమ్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పెంచి అనంతపురం వాసులకు ప్రత్యేక గ్రీవెన్స్ సెల్

జమ్మలమడుగు : గండికోట ముంపు గ్రామమైన పెంచి అనంతపురం గ్రామస్తులకు రెవెన్యూ అధికారులు బుధవారం ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. అయితే ముంపు వాసులు కనీసం పది మంది కూడా సరైన ధ్రువీకరణ పత్రాలను చూపించలేక పోయారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి ముంపువాసుల కోసం అధికారులు ఎదురు చూశారు. సాయంత్రం నాలుగు గంటల వరకు నలుగురు ముంపువాసులు మాత్రమే వచ్చారని అధికారులు తెలిపారు.

**152 మంది ముంపు బాధితుల కోసం..**

గండికోట ముంపు గ్రామాలలో ఒక్కటైన పెంచి అనంతపురంలో 152 మంది తమను రెవెన్యూ అధికారులు ముంపు వాసులుగా గుర్తించలేదని, అధికారులు సర్వే చేస్తున్న సమయంలో తాము స్థానికంగా లేమని తమను కూడా ముంపు వాసులుగా గుర్తించాలంటూ గ్రామస్తులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు గ్రీవెన్స్ డే ఏర్పాటు చేసి అర్హులైన వారిని ముంపువాసులుగా గుర్తించాలంటూ ఆదేశాలు జారీ చేసింది. బుధవారం రెవెన్యూ అధికారులు ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలో గ్రీవెన్స్ ఏర్పాటు చేశారు.

## భూ రీ సర్వేను పరిశీలించిన జేసీ



ఇడమడకలో భూ రీ సర్వేను పరిశీలిస్తున్న జేసీ అదితి సింగ్

దువ్వూరు(చాపాడు) : దువ్వూరు మండల పరిధిలోని ఇడమడక గ్రామంలో జరుగుతున్న భూ రీ సర్వేను బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ పరిశీలించారు. ఇడమడక గ్రామాన్ని ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని భూ రీ సర్వే చేపట్టింది. గత కొన్ని రోజులుగా జరుగుతున్న రీ సర్వేను జేసీ అదితి సింగ్, ఆర్డీఓ సాయిశ్రీ పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు భూ సర్వేను గడువులోగా పూర్తి చేయాలని జేసీ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అక్బర్ బాషా, రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్లు పాల్గొన్నారు.

**రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించిన జేసీ..**

మండల వ్యాప్తంగా ఇటీవల జరిగిన రెవెన్యూ గ్రామ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులను బుధవారం జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానిక రెవెన్యూ సిబ్బందికి సూచించారు.

## వైద్య ఆరోగ్య శాఖలో విచారణ

కడప రూరల్ : జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో చేపట్టిన ఉద్యోగ నియామకాల్లో కార్యాలయ సిబ్బంది బోగస్ సర్టిఫికెట్ల రూపంలో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చాయి. ఈ అంశానికి సంబంధించి గత ఏడాది డిసెంబర్ 20వ తేదీన సాక్షిలో వైద్య ఆరోగ్య శాఖకు అవినీతి జబ్బు అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. హెల్త్ అండ్ ఫ్యామిలీ కమిషనర్ వాకాటి కరుణ ఆదేశాలతో విచారణ అధికారిగా నియమితులైన డాక్టర్ ఏ.మస్తాన్ బుధవారం కడపకు వచ్చారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని అడిషనల్ డీఎంహెచ్ఓ ఛాంబర్‌లో విచారణ చేపట్టారు. మొత్తం 21 మందిపై ఆరోపణలు వచ్చాయి. విచారణకు హాజరైన వారి వద్ద నుంచి విచారణ అధికారి ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసుకున్నారు. వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఫిర్యాదుదారులతో కూడా మాట్లాడారు. విచారణలో భాగంగా ఉద్యోగ నియామకాలతో సంబంధం లేని ఆ కార్యాలయ పరిపాలన అధికారి శ్రీదేవి సహకారం తీసుకున్నారు.

## హిట్ అండ్ రన్ కేసుల్లో పరిహారం చెల్లింపుపై సమీక్ష



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్

కడప అర్బన్ : కడపలోని కోర్టు ఆవరణంలో న్యాయసేవాసదన్‌లో బుధవారం 'హిట్ అండ్ రన్' కేసులలో పరిహారం చెల్లింపు అంశాలపై జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష జరిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ జి. శ్రీదేవి ఆధ్వర్యంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ ఈ కార్యక్రమం నిర్వహించారు. రాజంపేట ఏఎస్పీ మనోజ్ హెగ్డే, డీటీసీ డీఎస్పీ కరీం, కడప డీఆర్ఓ, ఆర్డీఓ, మదనపల్లె తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం బాటిళ్లు స్వాధీనం

అట్లూరు : మద్యం బాటిళ్లతో సహా ఆటోను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఆయన వివరాల మేరకు ముందుగా అందిన సమాచారం మేరకు కడప – బద్వేలు ప్రధాన రహదారిపై బుధవారం ఉదయం ఆటోను తనిఖీ చేయగా అందులో మద్యం బాటిళ్లు ఉన్నాయన్నారు. వాటిని స్టేషన్‌కు తరలించి చూడగా అందులో 299 మద్యం బాటిళ్లు, 10 బీరు బాటిళ్లు ఉన్నాయని, ఆటోడ్రైవర్ లింగాలకుంట ఎస్సీ కాలనీకి చెందిన నాగరాజుగా గుర్తించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచామని తెలిపారు.

## చిరు దుకాణాన్ని కూల్చడం దుర్మార్గం

– వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి

రామాపురం : బతుకుదెరువు కోసం ఏర్పాటు చేసుకున్న చిరు దుకాణాన్ని కూల్చేసి నష్టం చేయడం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాచపల్లె పంచాయతీ సచివాలయం, పాఠశాల సమీపంలో గణేష్‌కుమార్‌రెడ్డి బతుకు దెరువు కోసం ఏర్పాటు చేసుకున్న చిరు దుకాణాన్ని నేలమట్టం చేసిన శిథిలాలను బుధవారం ఆయన పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ నిబంధనలకు వ్యతిరేకంగా ముఖ్యమంత్రే అధికార నివాసం ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఎవ్వరికి అడ్డు లేని ప్రాంతంలో బతుకుదెరువు కోసం చిన్న దుకాణం ఏర్పాటు చేసుకున్న వారిపై రాజకీయ కక్ష సాధించడం సమంజసం కాదన్నారు. ఇప్పటికే 46 సెంట్లు భూమి వారి పేరు మీద రెవెన్యూ రికార్డుల్లో ఉందన్నారు. పది మందికి విద్యనందించే పాఠశాల కోసం ఉచితంగా స్థలం అందించిన వారికే నష్టం కలిగించడం దుర్మార్గమన్నారు. చిన్న చిన్న విషయాల్లో రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకోవడం మంచి పరిణామం కాదన్నారు.

## జీఓ 117కు ప్రత్యామ్నాయాలు చేయాలి



విద్యాశాఖ అధికారికి డాక్యుమెంట్‌ను సమర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకుడు

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 117కు ప్రత్యామ్నాయాలను ఏర్పాటు చేయాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్, జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరచంద్ర, అలీఖాన్ కోరారు. అందుకు సంబంధించిన ప్రత్యేకమైన డాక్యుమెంట్‌ను రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు సంఘం తరపున సమర్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2025 -26 విద్యా సంవత్సరం నుంచి తెలుగు, ఆంగ్ల మాధ్యమాలను అన్ని పాఠశాలల్లో ప్రవేశపెట్టిన తర్వాతే జీఓ 117 ను రద్దు చేయాలన్నారు. 3,4,5 తరగతుల మెర్జింగ్‌ను ఉపసంహరించుకోవాలన్నారు. అన్ని బేసిక్ ప్రాథమిక పాఠశాలల్లో 2025 -26 విద్యా సంవత్సరం నుంచి 3వ తరగతి మాత్రమే కొనసాగించాలన్నారు. మిగులు ఉపాధ్యాయులను అవసరం ఉన్న పాఠశాలలకు సర్దుబాటు చేయాలని లేని సందర్భంలో అదే పాఠశాలలో కొనసాగించాలన్నారు.

## పేదలకు ఇళ్ల స్థలాల కోసం 27న చలో కలెక్టరేట్



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూమిని విముక్తి చేసి అర్హులైన పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం కేటాయించాలని కోరుతూ ఈనెల 27న చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపట్టనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర తెలిపారు. బుధవారం కడప నగరంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకులు ఎన్నికల ముందు ఇంటి స్థలం కేటాయిస్తాం, ఇళ్లు నిర్మిస్తామంటూ మాటలతో మభ్యపెట్టి అధికారంలోకి రాగానే హామీలను విస్మరిస్తున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు తాను అధికారంలోకి రాగానే గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి రూ.4 లక్షలతో ఇంటి నిర్మాణం పూర్తి చేయిస్తానని ప్రకటించారన్నారు. తన ఎన్నికల వాగ్దానాన్ని తక్షణంఅమలు చేయాలని, ఇంటి నిర్మాణ వ్యయాన్ని రూ.5లక్షలకు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూమి లేని నిరుపేదలకు రెండు ఎకరాల సాగు భూమి ఇవ్వాలన్నారు. కలెక్టరేట్ వద్ద జరిగే ఆందోళనకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి ఎస్.వెంకట శివ, జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్, పి.చంద్రశేఖర్, ఎంవీ సుబ్బారెడ్డి, ఎస్. విజయలక్ష్మి, జి.వేణుగోపాల్, బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 30,31న ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఎస్ఎఫ్ఐ 28వ జిల్లా మహాసభలను ఈ నెల 30, 31 తేదీల్లో కడప నగరంలో నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి వీరపోగు రవి తెలిపారు. బుధవారం ప్రకాశ్ నగర్‌లోని ప్రభుత్వ హాస్టల్‌లో జిల్లా మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తు పోరాటానికి ప్రణాళిక రూపొందించేందుకు ఈ మహాసభ నిర్వహిస్తున్నామన్నారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యను కాషాయీకరణ, ప్రైవేటీకరణ చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు జాలా సుమంత్, ఉపాధ్యక్షులు వంశీ, వినోద్, నగర నాయకులు మనోహర్, అభిలాష్ తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

### 29న వెల్లాలలో వేలం పాటలు

రాజుపాళెం : మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన వెల్లాలలోని శ్రీ చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వరస్వాముల ఆలయాలకు సంబంధించి ఈనెల 29న బుధవారం వేలం పాటలను నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కేవీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు టెంకాయలు అమ్ముకునేందుకు వేలం పాట జరుగుతుందన్నారు. ఈ పాటలో పాల్గొనేవారు రూ.50వేలు ధరావతు చెల్లించాలన్నారు. అనంతరం భక్తులు సమర్పించిన తలనీలాలను వేలం పాట నిర్వహిస్తామని, ఈ పాటలో పాల్గొనే వారు రూ.లక్ష ధరావతు చెల్లించాలన్నారు. కొబ్బరి చిప్పలు పోగు చేసుకునేందుకు నిర్వహించే వేలం పాటలో పాల్గొనేవారు రూ.10వేలు ధరావతు చెల్లించాలని తెలిపారు. పూజా సామగ్రిని అమ్ముకునేందుకు రూ.10వేలు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని పేర్కొన్నారు. వేలం పాటలో దక్కించుకున్న వారు ఏడాది పాటు నిర్వహించుకునేందుకు హక్కు కలిగి ఉంటారని తెలిపారు.

### విశ్వకర్మ యోజన ద్వారా ఐదు రోజుల శిక్షణ



టైలర్లకు శిక్షణ ఇస్తున్న ట్రైనర్

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణం రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న న్యాక్ బిల్డింగ్ కార్యాలయంలో న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రాకేష్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన ద్వారా టైలర్లకు ఐదు రోజుల శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ ఏపీ నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణ అనంతరం వీరికి ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన ధ్రువీకరణ పత్రం, ఉపకార వేతనాలతోపాటు టూల్ కిట్ అందిస్తామన్నారు. చాకలి, కార్పెంటర్, తాపీ మేస్త్రీ, క్షురకులకు కూడా శిక్షణ ఇస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### స్థలం సమస్యపై వాగ్వాదం

చాపాడు : మండల పరిధిలోని వీరభద్రాపురం సమీపంలో సర్వే నంబర్ 311/ఏ వద్ద రోడ్డు పక్కన ఉన్న 22 సెంట్ల పొలం విషయమై బుధవారం వరికూటి చంద్ర ఓబుళరెడ్డి, సురేంద్రనాథ్‌రెడ్డి వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ పొలం విషయమై ఐదు నెలల నుంచి ఇరువర్గాల మధ్య ఘర్షణ జరుగుతోంది. ఈ క్రమంలో సురేంద్రనాథ్‌రెడ్డి వర్గీయులు తమ పెద్దల సమాధులను భద్రపరుచుకునేలా నిర్మాణ పనులు చేపట్టారు. తమ పొలం వద్ద ఉన్న ఈ స్థలంలో పనులు చేపట్టేందుకు వీల్లేదని చంద్ర ఓబుళరెడ్డి కుటుంబీకులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ ఏర్పడగా పోలీసులు అదుపు చేశారు. అనంతరం సురేంద్రనాథ్‌రెడ్డి వర్గీయులు పనులు చేపట్టారు. ఈ విషయంపై తహసీల్దార్ రమాకుమారిని వివరణ కోరగా పట్టా పొలం సమస్యపై తాము జోక్యం చేసుకోలేదని కోర్టు ద్వారా ఇరువర్గాల వారు సమస్యను పరిష్కరించుకోవాలని చెప్పారు.

### రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని యువకుడి మృతి

దువ్వూరు(చాపాడు) : కడప – కర్నూలు జాతీయ రహదారిలోని దువ్వూరు సమీపంలోని బైపాస్ రోడ్డులో బుధవారం సాయంత్రం లారీ కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో 30 ఏళ్ల వయస్సు కలిగిన గుర్తు తెలియని యువకుడు వాటర్ బాటిల్ చేత్తో పట్టుకుని రోడ్డు దాటుతుండగా ప్రమాదవశాత్తు లారీ కింద పడి మృతి చెందాడు. ఈ ఘటనపై సీసీ ఫుటేజీ ద్వారా మృతుడి వివరాలపై ఆరా దీస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### కుక్కల దాడిలో 25 గొర్రెలు మృతి



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

దువ్వూరు(చాపాడు) : మండల కేంద్రమైన చాపాడులోని కాకతీయ కాలనీలో గొర్రెల మందపై కుక్కలు దాడి చేయగా 25 గొర్రెలు మృతి చెందాయి. కాలనీకి చెందిన పుట్టా ఓబులేసు, లక్ష్మీదేవి దంపతులు ఇంటి సమీపంలో మేకల దొడ్డిని ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో 50కి పైగా గొర్రెలు ఉన్నాయి. ఈ క్రమంలో రోజు మాదిరే మేకలను మేతకు తీసుకెళ్లి మంగళవారం సాయంత్రం దొడ్డిలోకి తీసుకెళ్లి పెట్టారు. అర్ధరాత్రి సమయంలో గొర్రెల మందపై కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో 25 గొర్రెలు మృతి చెందగా మరి కొన్ని గొర్రెలు గాయపడ్డాయి. బుధవారం ఈ సంఘటనను బాధిత దంపతులు గుర్తించారు. విషయం తెలుసుకున్న పశు వైద్యాధికారి ఫణీంద్రారెడ్డి గాయపడిన గొర్రెలకు చికిత్స అందించారు. కుక్కల దాడిలో గాయపడిన గొర్రెల విలువ రూ.4లక్షలు ఉంటుందని, ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

### జాతీయ రహదారికి భూ నిర్వాసితులు సహకరించాలి

బ్రహ్మంగారిమఠం : నేషనల్ గ్రీన్ హైవే రోడ్డు నిర్మాణానికి భూ నిర్వాసితులు కాంట్రాక్టర్లకు సహకరించాలని బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్ తెలిపారు. బుధవారం సాయంత్రం మల్లేపల్లె పంచాయతీలో జరుగుతున్న రోడ్డుపనులను ఆర్డీఓ పరిశీలించారు. లింగాలదిన్నెపల్లె, శ్రీరామనగర్, ముడుమాల, ఎద్దులాయపల్లె గ్రామస్తులు రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకున్నట్లు రెవెన్యూ అధికారులకు తెలియడంతో ప్రత్యేకంగా ఆర్డీఓ పరిశీలించారు. అనంతరం మల్లేపల్లెలో భూ నిర్వాసితులతో మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్ట పరిహారం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జాన్స్, రోడ్డు నిర్మాణం కాంట్రాక్టర్ల ప్రతినిధులు, సర్వేయర్లు, వీఆర్‌ఓలు , పంచాయతీ సర్పంచ్ లక్ష్మీదేవి భర్త నారాయణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.